
10.4 మి.మీ వర్షపాతం నమోదు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 25 : జిల్లాలో బుధవారం 10.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. గంగారంలో 32.4 మిల్లీ మీటర్లు, గార్లలో 1.4, డోర్నకల్‌లో 11.0, కురవిలో 4.8, మహబూబాబాద్‌లో 3.2, నెల్లికుదురులో 4.6, నర్సింహులపేటలో 27.6, చిన్నగూడూరులో 11.4, మరిపెడలో 44.6, దంతాలపల్లిలో 10. 8, తొర్రూరులో 3.6, పెద్దవంగర మండలంలో 11.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కేసముద్రం మార్కెట్‌లో మొక్కజొన్న పంట తడిసి ముద్దయ్యింది.

మహానగరంలో భూ మాయగాళ్లు చెలరేగిపోతున్నారు. వరంగల్ ట్రై సిటీస్‌లో సర్కారు జాగా ఖాళీగా కనిపిస్తే చాలు ఫెన్సింగ్ వేసి చుట్టేస్తున్నారు. పొరుగు భూముల సర్వే నెంబర్లతో రూ.కోట్ల విలువైన సర్కారు భూములకు ఎసరు పెడుతున్నారు. అక్రమ నిర్మాణాలతో పర్మినెంట్‌గా సెటిల్ అయిపోతున్నారు. కొన్నాళ్లుగా హనుమకొండ హంటర్ రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై ఏర్పాటు చేసిన సైన్స్ సెంటర్‌తో పాటు సుమారు 10ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, తాజా, మాజీ కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతలతో పాటు చోటామోటా నేతలు గుట్టలను తవ్వేస్తూ.. ఖాళీస్థలాల్లో దర్జాగా తిష్టవేస్తున్నారు. అడుగు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతేనే ఆగమాగమయ్యే అధికారులు పులిగుట్ట ప్రాంతంలో సుమారు రూ.200కోట్లకు పైగా విలువైన భూములు కబ్జా అవుతుంటే చోద్యం చూస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆక్రమణకు గురవుతున్న హనుమకొండలోని పులిగుట్ట




సైన్స్ సెంటర్ భూములు స్వాహా!

కబ్జాకోరల్లో 200కోట్ల విలువైన పదెకరాలు

- మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు, తాజా, మాజీ కార్పొరేటర్ల హస్తం
- హంటర్‌రోడ్డులోని సర్వే నెంబరు 964, 966లో 49ఎకరాల ప్రభుత్వ భూమి
- 2015లో టైగర్స్‌హిల్స్‌పై 15ఎకరాల్లో సైన్స్ సెంటర్ ఏర్పాటు
- ఆ కేంద్రంతో పాటు పదెకరాలకుపైగా సర్కారు స్థలాల అన్యాక్రాంతం
- పక్క సర్వే నెంబరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు.. దర్జాగా అక్రమ నిర్మాణాలు
- పులిగుట్ట పరిసర ప్రాంతాల భూములపై సర్వే చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉమ్మడి ఓరుగల్లు విద్యార్థులు మరింత అభ్యున్నతి సాధించాలన్న లక్ష్యంతో 2015లో హంటర్‌రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై 15ఎకరాల్లో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(టీజీసీఎస్టీ)ని ఏర్పాటు చేశారు. నాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ రీజనల్ సైన్స్ సెంటర్‌లో 69సైన్స్ ఎగ్జిబిషన్స్‌తో పాటు ఫిజిక్స్, బయోలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందు కోసం గతంలోనే ప్రభుత్వం రూ.6కోట్లు వెచ్చించింది. తాజాగా మరో రూ.4కోట్లతో సైన్స్ సెంటర్ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పనులు ప్రారంభించారు. నగరం నడిబొడ్డులో ఉండ టంతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉపయో గపడే టైగర్స్‌హిల్స్ గుట్టల భూములపై కబ్జాకోరుల కన్ను పడింది. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొల్లకొడుతున్నారు.



రికార్డుల్లో సర్వే నెం.964, 966లో ప్రభుత్వ భూమిగా నమోదు

రూ.200కోట్ల విలువైన భూములు స్వాహా?

వరంగల్ మహానగరం రోజురోజుకు విస్తరిస్తోంది. దీంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమార్కులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేస్తూ దర్జాగా కబ్జా చేస్తున్నారు. హనుమకొండ పట్టణంలోని హంటర్‌రోడ్డులో వన విజ్ఞాన కేంద్రం, రీజనల్ సైన్స్ సెంటర్‌తో పద్మాక్షి గుడి, సిద్ధేశ్వరస్వామి ఆలయం, జూ పార్కులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం కమర్షియల్‌గా అభివృద్ధి చెం దుతోంది. ఈ ఏరియాలో హనుమకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 964లో 44.37 ఎకరాలు, సర్వే నెంబరు 966లో 4.03ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెండు సర్వే నెంబర్లలో మొత్తం 49ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో రీజనల్ సైన్స్ సెంటర్ కోసం 2015లో ప్రభుత్వం 14.20ఎకరాల భూమిని కేటాయించింది. సర్వే నెంబర్లు 964, 966లో మొత్తం 49ఎకరాల్లో సైన్స్ సెంటర్‌కు 14.20 ఎకరాల భూమిని కేటాయించగా, మిగిలిన భూమిలో 127 అక్రమ కట్టడాలు నిర్మించి నట్టు గుర్తించారు. వీటికి కార్పొరేషన్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించటంతో పాటు ఇంటి పన్ను, నల్లాపన్నులు కూడా వసూళ్లు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మిగిలిన భూ మికి ఎలాంటి హద్దులు లేకుండా అధికారులు వది లేశారు. ఇందులో శిల్పారామం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేయాలని గతంలో తహసీల్దార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అవి అమలుకు నోచుకోలేదు. కాలక్రమేణా హంటర్ రోడ్డు అభివృద్ధి చెందుతుండటంతో కబ్జారా యుళ్ల కళ్లు టైగర్ హిల్స్‌పై పడింది. గత ప్రభుత్వ హ యంలో కీలక నేతలు ఆదేశాలతోనే వారి అను చరులు హంటర్‌రోడ్డులో ఉన్న ఖాళీగా కనిపిస్తున్న గుట్టతో పాటు చెట్లను, పొదలను తన ఎక్స్‌కవేటర్ యంత్రాలతో ఓ నేత చదును చేసి దర్జాగా కబ్జా చేశారనే ప్రచారం జరుగుతోంది. పక్కనే ఇతర స ర్వే నెంబర్లలో భూములు

మిగతా 6వ పేజీలో..



సర్వే నెం.964లో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

- సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



జిల్లా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సర్కార్ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ పట్టణంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మెడికల్‌వార్డు, దయాలసిస్‌సెంటర్, గైనిక్‌వార్డు, క్యాన్సర్‌బ్లాక్, డీఈఐసీ, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్, ప్రత్యేక నవజాత శిశుకేంద్రం, ఐసీయూలను సందర్శించి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రతీ వార్డులో మందులు, కావాల్సిన వైద్యపరికరాలన్నీ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగానమోదు అయ్యే అవకాశం ఉన్నందున జిల్లా ఆస్పత్రికి ప్రజలు అధికంగా రావచ్చని, అందుకు వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సాహించాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి వైద్యపరీక్షలు వెంటనే నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. మెడికల్ ల్యాబ్, ఫార్మసీ, ఇన్, అవుట్ పేషెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

కంబాల చెరువు కట్ట సందర్శన..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంబాల చెరువు కట్టను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సందర్శించారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం, ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలతో సరదగా గడపడానికి వీలుగా చెరువుకట్టపై సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్ పార్కులకు ప్రతిపాదనలు (యాక్షన్‌ప్లాన్) సిద్ధం చేయాలని సంబంధిత మునిసిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి డివిజన్‌స్థాయి క్రీడలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 26 నుంచి 28 వరకు డివిజన్ స్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు డీడీ సైదానాయక్, పీడీ మోహన్‌నాయక్ తెలిపారు. మహబూబాబాద్ డివిజన్ ఐటీడీఏ పరిధిలోని అండర్-14, 17 సంవత్సర బాలబాలికలకు ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, రన్నింగ్, టెన్నికాయిట్ క్రీడలు జరుగుతాయని వివరించారు. గురువారం ఉదయం 9గంటలకు రెడ్యాల ఆశ్రమ పాఠశాలలో క్రీడలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వసతి గృహాల హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు, వార్డెన్‌లు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పోలీస్‌ల గౌరవం పెంచేలా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 25 : పోలీసుల గౌరవం పెంచేలా నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ ఎస్సైలు విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సూచించారు. జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు నూతన ఎస్సైలు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ అకాడమీలో తొమ్మిదినెలల పాటు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 547మంది సబ్ ఇన్‌స్పెక్టర్లుతెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ వివిధ జిల్లాలకు కేటాయించారు. ఈ నేపథ్యంలోమహబూబాబాద్ జిల్లాకు ముగ్గురు సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్లను కేటాయించినట్లు చెప్పారు.

బయ్యారంలో గ్రామ స్థల వివాదం.. ఉద్రిక్తత

- మోహరించిన పోలీసులు
- అఖిలపక్ష నేతల ముందస్తు అరెస్టు, విడుదల
- 144 సెక్షన్ విధింపు.. అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

బయ్యారం, సెప్టెంబరు 25 : గత కొంతకాలంగా వివాదస్పదంగా మారిన గ్రామస్థల విషయమై బయ్యారంలో బుధవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మహబూబాబాద్ సబ్‌డివిజన్ పరిధి పోలీసులు భారీగా మోహరించారు. 144 సెక్షన్ అమలు చేస్తూ, పలువురు అఖిల పక్ష నేతలను ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. దీంతో అక్రమ అరెస్టులకు నిరసనగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆందోళన చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా, అదుపులోకి తీసుకున్న వారికి పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

బయ్యారం బస్టాండ్ సెంటర్ డీసీసీబీ బ్యాంక్ సమీపంలో చౌదరి మైనింగ్‌కంపెనీ (సీఎంసీ)కి చెందిన నివాస స్థలం చాలా కాలంగా ఖాళీగా ఉన్నది. అనంతరం గ్రామాభివృద్ధికి స్థలదాత తన స్థలంలోని కొంత భాగం భూమిని గ్రామానికి దానం చేశారు. అనంతరం ఏం జరిగిందో..! ఏమో తెలియదు కాని మండలానికి చెందిన పలువురు గిరిజనులు చట్టప్రకారం ఆ స్థలాన్ని తాము కొనుగోలు చేశామని పేర్కొంటూ ఇటీవల ఆ స్థలానికి రక్షణ కవచం ఏర్పాటు చేసి, ముందు భాగంలో పలు గదులు నిర్మాణం చేపట్టారు. దీంతో ఈ విషయమై మండలంలో కొంత కాలంగా రగడ నెలకొన్నది. స్థలం గ్రామానికి దక్కేలా మండల అఖిలపక్ష నాయకులు పలు ప్రయత్నాలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పలువురు మంత్రులను కలిసి విన్నవించారు. ఈ క్రమంలోనే స్థలం కొనుగోలు దారులు, అఖిలపక్ష నేతల నడుమ ఘర్షణ వాతావారణం నెలకొనే ప్రమాదముందని ముందస్తు సమాచారం తెలుసుకున్న పోలీసులు బుధవారం బయ్యారంలో భారీగా మోహరించారు.



బయ్యారంలో సేవాలాల్ సేన నాయకుడు రవి నాయక్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



బయ్యారంలో మోహరించిన పోలీసులు

జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ నేతృత్వంలో డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో మహబూబాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని 4 గురు సీఐలు, 8 మంది ఎస్సైలతోపాటు 80 మంది స్పెషల్ పార్టీ, ఏఆర్, సివిల్ పోలీసు సిబ్బంది శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బయ్యారంలో మోహరించారు. 144 సెక్షన్ విధించడంతో పాటు వివిధ పార్టీలకు చెందిన 16 మంది అఖిలపక్ష నాయకులు, ముగ్గురు స్థల కొనుగోలు దారులను ముందస్తు అదుపులోకి తీసుకొని పలు స్టేషన్లకు తరలించారు. దీంతో ఉదయం నుంచి బయ్యారంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లో అక్రమ అరెస్టులకు నిరసనగా నాయకులు రాస్తారోకో చేపట్టగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో కూడా పలు పార్టీలకు చెందిన నాయకులు రాస్తారోకోకు పూనుకోగా, పోలీసులు ఆందోళనను అదుపు చేశారు. 144 సెక్షన్ అమలులో ఉంది ఎలాంటి ఆందోళన కార్యక్రమాలకు అనుమతి లేదని బయ్యారం సీఐ రవికుమార్ పేర్కొనడంతో నేతలు ఆందోళన కార్యక్రమాన్ని ఉపసంహరించుకున్నారు. ఇదిలా ఉండగా అక్రమ అరెస్టులను జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు ఖండించారు. బయ్యారంలో అక్రమంగా అదుపులోకి తీసుకున్న వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా ముందుస్తు అదుపులోకి తీసుకున్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించి విడుదల చేసినట్లు బయ్యారం ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. పోలీసు బలగాలు కూడా వెళ్లిపోయినట్లు తెలిపారు.

ప్రజల్లో ఆందోళన..!

గ్రామస్థలానికి సంబంధించి కొంత కాలంగా వివా దం నెలకొనడంతో పరిస్థితులు ఎటు దారితీస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలువురు గిరిజనులు చట్టప్రకారం సీఎంసీగా పిలువబడే స్థలాన్ని తాము కొనుగోలు చేశామని చెప్పుండగా.. గ్రామాభివృద్ధికై దానంగా ఇచ్చిన సీఎంసీ స్థలన్ని ఎలా కొనుగోలు చేస్తారని మండల అఖిలపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ వివాదం ఎటు దారితీస్తుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

ప్రశస్తతో వైకల్య గుర్తింపు

- యాప్‌పై ఉపాధ్యాయులకు పూర్తయిన శిక్షణ
- నేటి నుంచి అన్ని పాఠశాలల్లో నెలరోజుల పాటు సర్వే
- జిల్లాలో లక్ష మందికిపైగా విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 : పుట్టుకతోనే చిన్ని చిన్న లోపాలతో జన్మించి.. వైద్యపరీక్షల ద్వారా నయమయ్యే పరిస్థితి ఉన్నా.. అవగాహన లేకపోవడంతో భవిష్యత్ నీరుగారిపోతోంది. వయసు పెరిగేకొద్ది దివ్యాంగత్వం కూడా ముదిరిపోతూ జీవితాంతం బాధపడే పరిస్థితి చాలా మందిలో చూస్తూనే ఉంటున్నాం. భావి భారత పౌరులుగా ఎదగాల్సిన బాల్యం చిన్నచిన్న అంగ వైకల్య సమస్యలతో అంధకారమవుతోంది. దీన్ని చిన్నతనంలో గుర్తించడంతో పాటు అర్హత కలిగిన వారికి ప్రభుత్వ పరంగా అందించాల్సిన సౌకర్యాలను కల్పించేందుకు కేంద్రం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 'ప్రశస్త యాప్'ను అందుబాటులోకి తీసుకువచ్చారు.



కురవి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సమావేశంలో ప్రశాస్త యాప్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్‌లు

18 మండలాల పరిధిలో..

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 23 నుంచి 25 వరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్(ప్రశస్త) యాప్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటుతో పాటు అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో వైకల్యం గుర్తించేందుకు ప్రశాస్త యాప్‌ను ఉపయోగిస్తూ వైకల్యాన్ని ఎలా గుర్తించాలనే అంశాలపై అవగాహన కల్పించారు.

నేటినుంచి సర్వే షురూ..

మండల కేంద్రాల్లో శిక్షణ పొందిన సదరు

మిగతా 8వ పేజీలో..

నేటినుంచి మొదటి దశ స్క్రీనింగ్

వి.రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖాధి



జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రశస్త యాప్ నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. జిల్లా వ్యాప్తంగా గురు వారం నుంచి అన్ని పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వైకల్యాన్ని గుర్తించేందుకు ప్రశస్త యాప్ ద్వారా మొదటి దశ స్క్రీనింగ్ చేస్తారు. రెండోదశలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు (ఐఈఆర్పీ)లు అక్టోబరు 26 నుంచి నవంబరు 14 వరకు ఉపాధ్యాయులు గుర్తించిన పిల్లలను రీ సర్వేచేసి వైకల్యం ఉన్న వారిని గుర్తిస్తారు. మూడోదశలో వైకల్యం ఉన్న విద్యార్థులను వైద్యులు పరీక్షించి ప్రభుత్వం నుంచి అందాల్సిన పరికరాలను అందిస్తారు.

యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి

మరిపెడ, సెప్టెంబర్ 25 : మౌంటెనర్ యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి చేరింది. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన భూక్యా రామ్మూర్తి-జ్యోతి దంపతుల చిన్నకుమారుడైన భూక్యా యశ్వంత్ అతి చిన్న వయస్సులోనే ఆయన వయస్సుకు మించి అరచేతిలో ప్రాణాలను అడ్డుపెట్టి భయంకరమైన పర్వతాలను అధిరోహిస్తూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌డీసీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న భూక్యా యశ్వంత్ ఇప్పటికే సౌత్‌ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్బ్రస్, కోజియోసిస్, యానం, కాగ్‌చేట్, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పర్వతాలను అధిరోహించారు. సెప్టెంబరు 4వ తేది నుంచి 18రోజుల పాటు పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి 22వ తేదిన అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ అత్యంత క్లిష్టమైన పర్వాతాన్ని సైతం జయించారు. ఓ వైపు సడలిపోతున్న రాళ్లు, మరో వైపు ప్రమాదకరమైన మెరైన్‌గ్లేసియర్‌ను తట్టుకొని అవలీలగా గోరిచెన్ శిఖరానికి చేరుకొని త్రీవర్ణ పతకాన్ని ఎగిరేశారు. దీంతో ఆయన ఖాతాలోకి మరో పర్వతం చేరింది. ఈ పర్వత శిఖర్నాన్ని ఎక్కేందుకు ఇది వరకు కేవలం ఆర్మీ జవాన్లకే అవకాశం ఉండేది. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీ సహాయ సహకారాలు, పెద్దల దాతృత్వంతో గోరిచెన్ పర్వాతాన్ని జయించిన తొలి సివిలియన్‌గా యశ్వంత్ గుర్తింపు దేశచరిత్రలోనే గుర్తింపు పొందారు. ఈ గుర్తింపు తనకు ఎంతో సంతోషంగా ఉందని యశ్వంత్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పేర్కొన్నారు. యశ్వంత్ పర్వతరోహణపై మరిపెడ మండల ప్రజలు, భూక్యా తండా వాసులు, ఆయనకు ఆర్థికంగా, హర్షికంగా సహకరించిన దాతలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్

సైన్స్ సెంటర్ భూములు.. స్వాహా!

(5వ పేజీ తరువాయి)

కొను గోలు చేసినట్టుగా నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి, ఇతరులకు ద ర్జాగా అమ్మకాలు చేశారని సమాచారం. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, ఉద్యోగులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మొత్తంగా హంటర్ రోడ్డులో సుమారుగా 10ఎకరాలకు పైగా కబ్జా అయినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో గజానికి రూ.50వేల నుంచి రూ.1లక్షకు పైగా ధర పలుకుతుంది. ఈ నేపథ్యం లో పదెకరాల స్థలం కబ్జా అయితే దాని విలువ రూ.200కోట్లకు పైగానే ఉంటుందని, ఇంత జరిగినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనేది చర్చనీయాంశంగా మారింది.

కబ్జాల వెనుక కీలక నేతలు!

సైన్స్ సెంటర్ భూముల అన్యాక్రాంతం వెనుక బడా నేతలున్నారనే చర్చ జరుగుతోంది. అడుగు జాగా కబ్జా అయితేనే అగమాగం చేసే అధికారులు వందల కోట్ల సర్కారు స్థలం కబ్జాకు గురైతే మౌనంగా ఎందుకు ఉంటున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఈ భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లగా.. సర్వే నిర్వహించి, అక్రమణలో ఉన్నవాటిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు లోకాయుక్తాకు హామీ ఇచ్చారు. ఇది జరిగి రెండేళ్లు గడుస్తున్నా ఈ భూముల స్వాహాపై నిగ్గుతేల్చడం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ కబ్జాల పర్వం వెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులు, తాజా, మాజీ కార్పోరేట ర్ల హస్తం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న మరో నేత కూడా కబ్జా చేసిన భూమిలోనే తిష్ట వేశారనే ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యేలతో పాటు కీలకమైన నేతలు, వారి అనుచరులు అక్రమార్కుల్లో ఉండటంతోనే అధికారులు భూముల సర్వేకు వెనుకాడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే అనుచరుడు యంత్రాలతో గుట్టను తవ్వి పక్క సర్వే నెంబర్లతో భారీగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం రమేష్ అనే వ్యక్తి సైన్స్ సెంటర్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తుండగా, హనుమకొండ రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద వెళ్లి అడ్డుకున్నారు. అదే అధికారులు గత ప్రభుత్వం హయాంలో స్వాహా చేసిన కబ్జాకోరులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ చొరవ తీసుకుని సర్వే నెంబరు 964, 966లో ఉన్న 49ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు వెంటనే టైగర్ హిల్స్(పులి గుట్ట)లో భూ సర్వే నిర్వహించాలని, కోట్లాది రుపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు కబ్జాకోరుల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహకు వినతి పత్రం అందిస్తున్న వైద్యులు

పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలని పెంచాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పల్లె దవాఖాన వైద్యులు కోరారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతీ గ్రామంలో జ్వర సర్వే నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన వారికి మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దశరథ్, డాక్టర్ సురేశ్, డాక్టర్ విజయ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఐపై సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్ సీఐపై సీపీ అంబర్ కిషోర్ ఝాకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఒక డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిపించి అక్రమ కేసు నమోదు చేసిన సీఐ.. తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. డివిజన్‌కు చెందిన ఇద్దరు నేతలకు, అదే డివిజన్‌కు చెందిన మరోనేతకు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఇద్దరు నేతలు నియోజకవర్గంలో హవా కొనసాగిస్తున్న ఒక వ్యక్తితో సీఐకి ఫోన్‌చేయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సీఐ డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిచి కేసుపెట్టడంతో పాటు చేయిచేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై మనస్థాపానికి గురైన డివిజన్ నేత.. బుధవారం సీపీని కలిసి సీఐపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై సీపీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. మొత్తంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు నేతల మెప్పు కోసం ప్రయత్నిస్తూ వివాదాల్లో ఇరుక్కుంటున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని, లేదంటే బిల్లులు నిలిపివేస్తామని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ హంటర్‌రోడ్డు ప్రాంతంలో 100ఫీట్ల రోడ్డు వద్ద నిర్మించిన సీసీరోడ్డులో పాటు సాయినగర్ ప్రాంతంలో నిర్మించిన డ్రైనేజీని కమిషనర్‌తో పాటు అధికారులు బుధవారం పరిశీలించారు. కొలతలు వేసి పరిశీలించి అక్కడి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రాజ్‌కుమార్, రంగారావు, కృష్ణమూర్తి, ఏఈలు సతీష్, హరికుమార్, ముజామిల్ పాల్గొన్నారు.



కాంతులీనుతున్న.. కళా సౌధం..

ప్రారంభానికి సిద్ధమవుతున్న కాళోజి కళాక్షేత్రం

ఉమ్మడి జిల్లా సాంస్కృతిక కళావైభవాన్ని చాటిచెప్పేలా.. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. 2014లో నాటి సీఎం కేసీఆర్ జైపూర్‌లో రాజమహల్ తరహాలోని ఈ రాజసౌధానికి శంకుస్థాపన చేయగా.. రూ.85కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. వచ్చేనెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉండబోతోందని అధికారులు ఇప్పటికే తెలిపారు. ఈ నేపథ్యంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో కళాక్షేత్ర భవనం ధగధగమెరిసిపోతోంది. ఇక బుధవారం ఈ కళాక్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే పరిశీలించారు. మిగిలిన పనుల వివరాలను నిర్వహణ సంస్థ ప్రతినిధులను ద్వారా తెలుసుకున్న వారు త్వరితగతిన పూర్తిచేయాలని , ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- బాలసముద్రం(హనుమకొండ)

మార్కెట్లో తడిచిన మొక్కజొన్నలు

- ఓపెన్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ఆరబెట్టిన మక్కలు
- వెయ్యి బస్తాలకుపైగా సరుకు ఆగం
- టార్పాలిన్లు ఇవ్వడంలేదని రైతుల ఆరోపణ



కేసముద్రం మార్కెట్ యార్డులో తడిచిన మొక్కజొన్నలను దగ్గరకు చేరుస్తున్న రైతులు



తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య రాంజీ

కేసముద్రం, సెప్టెంబర్ 25 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో బుధవారం ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు తడిచిపోయాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 65 మంది రైతులు 2076 బస్తాల్లో 1246 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువచ్చారు. రైతులు తమ చెల్కల వద్ద స్థలం లేకపోవడంతో మార్కెట్‌కు మొక్కజొన్నలను తీసుకువచ్చి ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు తమ సరుకు తేమశాతం అధికంగా ఉండడంతో ఓపెన్ యార్డులో పోసుకున్నారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం రావడంతో రైతులు తమ సరుకును కుప్పగా పోసుకొని, రక్షించుకునేంత వ్యవధి కూడా లేక సరుకు పూర్తిగా తడిచిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో వరద నీటిలో మొక్కజొన్న కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సరుకు ఆరబెట్టుకు వారిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. వర్షం వస్తున్న సమయంలో మార్కెట్ కార్యాలయంలో టార్పాలిన్లు కావాలని అడిగే లేవని సమాధానం చెప్పారని మండలంలోని పెనుగొండకు చెందిన రైతు శీలం శ్రీధర్‌తోపాటు మరికొంతమంది రైతులు ఆరోపించారు. మార్కెట్లో ఆరబెట్టుకున్న సరుకుకు తాము బాధ్యత వహించబోమని మార్కెట్ అధికారులు ఖరాకండితంగా చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుగొండకు చెందిన తుప్పర్తి భద్రయ్య, నర్సింహులగూడెం భూక్య రాంజీ, నారాయణపురం నాంపెల్లి సురేందర్, భూక్య మంగ్యా, గుగులోత్ వెంకన్న, భవానిగడ్డతండా ధరావత్ లచ్చీరాం తదితరులకు చెందిన సుమారు వెయ్యి బస్తాలకుపైగా మొక్కజొన్నలు తడిచిపోయాయి.

నేడు బల్దియాలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరవుతారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701999689 సెల్ నెంబర్‌కు ఫోన్‌చేయాలని డాక్టర్ రాజేశ్ తెలిపారు.

30 నుంచి కేయూ మెస్‌కు దసరా సెలవులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: కాకతీయ యూనివర్సిటీలోని మెస్‌లకు సెప్టెంబరు 30 మధ్యాహ్నం నుంచి దసరా పండువను పురస్కరించుకుని సెలవులను ప్రకటిస్తున్నట్లు వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో దసరా సెలవులు అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రకటించారన్నారు. కాగా, విద్యార్థులకు అక్టోబరు 15 నుంచి మెస్‌లన్నీ యథావిధిగా పునఃప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. అక్టోబరు 15 తర్వాత విద్యార్థులు హాస్టల్స్ అడ్మిషన్లు రెన్యూవల్ చేసుకోవాలని వారికే భోజనం పెడతామని స్పష్టం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టుపై 68 అసిస్టెంట్ ప్రొఫెసర్, నాలుగు సీఏఎస్ఆర్ఎంవో పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి కేఎంసీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 27 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు కేఎంసీలో ఉదయం 10 నుంచి 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రెయినీ ఎస్సైలకు పోలీసు స్టేషన్‌ల కేటాయింపు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లను కేటాయిస్తూ బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. పల్లె పవన్‌కు కాజీపేట, మామునూరు, బి.హేమలతకు సుబేదారి, వర్ధన్నపేట, బండారి శివకు మిల్స్‌కాలనీ, రఘునాథపల్లి, బి.సుజిత్‌కు ఆత్మకూరు, హనుమకొండ, అనంతగిరి మధుకు జనగామ, ఇంతెజార్‌గంజ్, లింగాల దిలీప్‌కు నర్సంపేట, హసన్‌పర్తి, పి.భాగ్యశ్రీకి స్టేషన్ ఘన్‌పూర్, పరకాల పోలీసుస్టేషన్‌లకు కేటాయించారు. ప్రతీ ఎస్సైకి రెండు స్టేషన్‌లు కేటాయించారు. వీరు ఈనెల 25 నుంచి వచ్చేనెల 10వరకు ఒక స్టేషన్, వచ్చేనెల 10 నుంచి 24వ తేదీ వరకు మరో స్టేషన్‌లో విధులపై శిక్షణ తీసుకోనున్నారు.



కేఎంసీలో జరిగిన ఉత్కర్ష వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు





వేడుకలను ప్రారంభిస్తున్న అధికారులు

ఉత్సాహంగా సాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్కర్ష వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం ఐదోరోజు ట్రెడిషనల్ డే నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాధారణలో కనిపించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం ట్రెడిషనల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి బహుమతులను అందజేశారు. సాయంత్రం విద్యార్థులు దాండిక కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

తల్లిదండ్రులు తలెత్తుకునేలా అమ్మాయిలు ఎదగాలి..

కేయూలో మహిళ ఇంజనీరింగ్ కళాశాల అవిర్భావ వేడుకల్లో డీసీసీ షేక్ సలీమా



యూ బ్లేడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ షేక్ సలీమా, ఈసీ మెంబర్లు సురేశ్‌లాల్, నిమ్మ సుదర్శన్ తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: అమ్మాయిలు తమ తల్లిదండ్రులు తలెత్తుకునేలా జీవితంలో ఎదగాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఉద్బోధించారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు అధ్యక్షతన కళాశాల అవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ సలీమా మాట్లాడుతూ.. మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుడాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలని సూచించారు. జీవితంలో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. షీటీంలపై అవగాహన ఉండాలని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగమణి మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు వ్యక్తిగత రక్షణ, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మంచి గుర్తింపు తెచ్చుకుని తమ కిష్టమైన రంగాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలతో పోటీపడి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. వర్సిటీ న్యాయకళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యకు బాగా డిమాండ్ ఉందని చెప్పారు. ఖరీదైన ఇంజనీరింగ్ విద్యను గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మాయిలకు వర్సిటీ క్యాంపస్ కళాశాల అందిస్తోందని వివరించారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని ఎదగాలని హితవు పలికారు. ఈసీ మెంబర్ డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడేందుకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో పేద, మధ్యతరగతి యువత చదువుకుని టెక్నాలజీరంగంలో ఎదుగుతున్నారని అన్నారు.

కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.కిరణ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించగా, అధ్యాపకులు డాక్టర్ వీణ, తూర్పాటి వెంకటేశ్, సురేందర్, సాయి తరుణ్, స్వప్న, వాణిశ్రీ, సాహితీ, యశస్విని, దీప్తి, పీవీ వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, దేవేందర్, వాణి, డాక్టర్ జ్యోత్స్న, అనూష, రమ, జ్యోతి ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వీరునాయక్, బోధనేతర సిబ్బంది మల్లేశం, జగన్, యాదగిరి, ఫిరోజ్, హుస్సేన్, చైతన్య, లావణ్య, నాగరాజు, తాజ్‌బాబా, ప్రమీల, మమత, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. అలాగే క్రీడాపోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా అతిథులు యూ బ్లెడ్‌యాప్‌ను ఆవిష్కరించారు. రక్తదాన ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మణ్ నాయక్ మృతి

వడ్డెపల్లి, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సదాశివ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కునుసూతు లక్ష్మణ్ నాయక్ (57)గుండె పోటుతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మణ్ నాయక్ భౌతికకాయాన్ని పరకాల ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ ధరంసింగ్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ యూనియన్ నేత గోవర్ధన్ నాయక్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.20వేలను ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులకు అందించారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ గుగులోత్ వీరన్న నాయక్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మైనర్లపై కేసు నమోదుపై ఆరా

ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: మైనర్లపై కేసు నమోదుపై ప్రభుత్వం ఆరా తీసింది. దీనిపై ఇంటెలిజెన్స్ అధికారులు నివేదికను పంపించారు. బుధవారం పత్రికల్లో మైనర్లపై కేసు నమోదుపై కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ప్రభుత్వం నివేదికను కోరగా ఇంటెలిజెన్స్ అధికారులు పంపారు. కట్ల రాజు అనే సీఐడీ కానిస్టేబుల్ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ టవర్స్‌లో ఉంటున్నాడు. ఈయనకు కూతురు ఉంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న 8మంది పిల్లలు రాజు కూతురిని దూషిస్తూ కారుపై గీతలు గీశారు. సీసీ పుటేజీ ద్వారా పిల్లలు చేసిన పనిని గుర్తించి వారి తల్లిదండ్రులకు చెప్పారు. అయితే కారు రిపేరుకు డబ్బులు చెల్లిస్తామని చెప్పి 10రోజుల వరకు స్పందించలేదు. దీంతో కానిస్టేబుల్ రాజు సుబేదారి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇన్సూరెన్స్ కంపెనీ కారు డ్యామేజీకి రూ.80వేలు చెల్లించింది. కేసు విచారణలో భాగంగా పిల్లల తల్లిదండ్రులను ఎస్ఐ పిలిపించినందుకు సోషల్ మీడియాలో వైరల్ అయిందని, ఆపై పత్రికల్లో కథనాలు వచ్చాయని నివేదికను ఇంటెలిజెన్స్ అధికారులు పంపించారు.

ఆ 'పెద్ద మనిషి' ఎవరు?

- ఆరా తీస్తున్న నిఘా వర్గాలు
- పోలీసులు మర్యాదలపై సీఎం సీరియస్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు మర్యాదలు పొందుతున్న వ్యక్తిపై నిఘా వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం. మంగళవారం కార్పొరేషన్‌కు వచ్చిన సదరు వ్యక్తికి ఒక ఏసీపీ, సీఐలు మర్యాదలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో సాధారణవ్యక్తిగా ఉన్న ఆ వ్యక్తికి ఇద్దరు గన్‌మెన్‌లు సైతం ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తి విషయం హాట్ టాపిక్‌గా మారడంతో ముఖ్యమంత్రి దృష్టికి సైతం వెళ్లినట్లు తెలిసింది. దీనిపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం. అతడికి గన్‌మెన్‌లు ఎందుకు ఇచ్చారని పోలీసు అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అధికార పార్టీ పేరు చెప్పుకుని పార్టీకి నష్టం కలిగే పనులు చేసేవారిని క్షమించకూడదని జిల్లా పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. సదరు వ్యక్తికి గన్‌మెన్‌లను తొలగించడంతో పాటు పార్టీకి దూరం పెట్టే అవకాశాలున్నట్లు తెలిసింది. మర్యాదలు చేసిన పోలీసు అధికారులపై త్వరలో చర్యలుండే అవకాశం ఉన్నట్లు అధికారిక సమాచారం.

క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలి

హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి

కేయూలో జంతుశాస్త్రం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గీత వేముగంటి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇస్తారి తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలని హైదరాబాద్ కేంద్రియ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి అన్నారు. బుధవారం జంతుశాస్త్ర విభాగంలో రెండురోజుల జాతీయ సదస్సు క్యాంపస్‌లోని జువాలజీ సెమీహాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా గీత కె.వేముగంటి మాట్లాడుతూ.. 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ యానిమల్ సైన్సెస్' అనే అంశం కీలక ప్రసంగం చేశారు. క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరమన్నారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడంతో క్యాన్సర్ కణాలుగా మారుతాయని పేర్కొన్నారు. క్యాన్సర్ కణాలు శరీరంలో ఇతర విభాగాలకు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. క్యాన్సర్ చివరి దశలో ప్రాణ ప్రాయం స్థితి ఏర్పడుతోందని చెప్పారు. క్యాన్సర్ చికిత్సలో వాడే మందుల వలన రోగ నిరోధక శక్తి క్రమగా తగ్గుతోందని అన్నారు. క్యాన్సర్ మూల కణాలపై సమగ్ర పరిశోధనలు జరగాలని అన్నారు. పరిశోధనలతోనే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను కనుగోనేందుకు వీలవుతుందని చెప్పారు.

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకుపోతోందని అన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ షమిత మాట్లాడుతూ.. రెండు రోజుల జాతీయ సదస్సుల్లో ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు 100మంది వరకు విలువైన పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వెల్లడించారు. బెంగళూరు గీతం వర్సిటీతోపాటు ఇతర వర్సిటీ నుంచి అతిథులు హాజరుకానున్నట్లు వివరించారు. సెమినార్ సావనీర్‌ను అతిథులతో కలిసి ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ మామిడాల ఇస్తారీ ఆవిష్కరించారు.



హనుమకొండ బస్టాండ్‌లో పోగొట్టుకున్న బంగారు గొలుసును అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

బాలసముద్రం, సెప్టెంబరు 25: హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ప్రయాణం చేస్తున్న ఓ వృద్ధురాలు పోగొటుకున్న బంగారు గొలుసును ఆర్టీసీ సిబ్బంది గుర్తించి ఆ వృద్ధురాలికి అందించారు. బుధవారం ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆకుల శంకరమ్మ బుధవారం హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తోంది. హనుమకొండలో దిగిన శంకరమ్మ తన బంగారు గొలుసు ఉన్న పర్సును బస్సులోనే మరిచిపోయింది. పర్సు పోయిందని గమనించిన ఆమె.. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నవీన్, ఆర్.శ్రీధర్‌లకు విషయాన్ని తెలిపింది. వెంటనే స్పందించిన వారు శంకరమ్మ ప్రయాణించిన బస్సు హనుమకొండ బస్టాండ్ నుంచి బయటకు వెళ్తుండగా బస్సును నిలిపివేసి అందులో ఉన్న బంగారం, ఇతర వస్తువులు తీసుకొచ్చి శంకరమ్మకు అందించారు. ఈ సందర్భంగా బస్టేషన్ మేనేజర్ సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


సత్యనారాయణ (ఫైల్)

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 25 : మాటేడులో ఓవ్యక్తి కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన ఎనగందుల సత్యనారాయణ (38) నిత్యం మద్యం తాగుతూ ఇంట్లో గొడవలు చేస్తుండే వాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య యామిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన పెంచుకోవాలి

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 25 : విద్యార్థులు కంప్యూటర్ విద్యపై అవగాహన పెంచుకోవాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేయశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరు, చెర్లపాలెం గ్రామాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సాకారంతో 12 కంప్యూటర్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం స్వచ్ఛంద సంస్థలు సహకరించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మదర్ వలెంటరీ ఆర్గనైజేషన్ సాకారంతో నూతన బోర్‌ను ప్రారంభించారు. ఎంఈవో బుచ్చయ్య, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ నిర్వాహకులు పి.కృష్ణ, కోఆర్డినేటర్ వంశీ, సూర్య, నిరంజన్‌రెడ్డి, సంతోష్, సోమరాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'దీన్ దయాళ్' గొప్ప స్ఫూర్తి ప్రదాత : బీజేపీ

తొర్రూరు, సెప్టెంబరు25 : బీజేపీ పూర్వపు జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గొప్పస్ఫూర్తి ప్రదాత అని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యటించి పార్టీ కార్యకర్తలకు తగు సూచనలు పార్టీ నిర్ణయం మేరకు ప్రతీ బూత్‌లో 100 సభ్యత్వాలు నమోదు చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, సురేష్, రాజేష్, నవీన్, రాజ్‌కుమార్, రాంబాబు, విజయ్, సంతోష్, సందీప్, రాకేష్ తదితరులు ఉన్నారు.

జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు : సీపీఎం

తొర్రూరురూరల్, సెప్టెంబరు 25 : కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్ అన్నారు. బుధవారం గుర్తూర్‌లో సీపీఎం మహాసభలు ఉమ్మగాని యాకయ్య, మార్క సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో జమిలి ఎన్నికలు సాధ్యంకాదన్నారు. మండల కార్యదర్శి యాకూబ్, గుద్దేటి సాయిమల్లు, యాకయ్య మధుబాబు, కుమారస్వామి, శంకరాచారి, రంగారావు, రవి పాల్గొన్నారు.

కేసులను పరిష్కరించుకోవాలి : ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 25 : మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడే అవకాశం ఉన్న కేసులను, లిస్ట్ అవుట్ చేసుకుని రాజీపడదగిన కేసుల్లో ఇరువర్గాల వారిని పిలిపించి సమస్యను పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నచిన్న కేసులతో జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ సదావకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్రం'

తొర్రూరు, సెప్టెంబరు 25 : పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ పేరుతో రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం తొర్రూరులోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్, వెంకన్న, రాములు, నవీన్, మల్లేష్, వెంకటమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవో 25ను ఉపసంహరించుకోవాలి

డోర్నకల్, సెప్టెంబరు 25 : ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట ప్రభుత్వం విడుదల చేసిన జీవో 25ను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ డోర్నకల్ మండల అధ్యక్షుడు వై.సాయిబాబా డిమాండ్ చేశారు. ముల్కలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను బదిలీ చేస్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. వెంటనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి, సరస్వతి, ఉమ, అనిత, ఆదిలక్ష్మి, షేక్‌ఆలీ, సంతులాల్ పాల్గొన్నారు.

● నెల్లికుదురు : ప్రభుత్వ పాఠశాలల రేషనలైజేషన్ జీవోను రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నెల్లికుదురులోని విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కొత్త నర్సింహరెడ్డి, గొట్టిముక్కుల శ్రీనివాస్‌రెడ్డి, పెరమాండ్ల రమేష్, సాయిలు, లక్ష్మణ్, బిక్కు, రాజేష్, సుధాకర్, సంతోష్, శేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

● కొత్తగూడ : ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 25ను వెంటనే విరమించుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నెల్లుట్ల భాస్కర్ డిమాండ్ చేశారు. పొగుళ్లపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 25ను తీసుకువచ్చి రేషన్ రేషనలైజేషన్ చేస్తు ప్రభుత్వ స్కూళ్లను మూసివేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు తెలిసిందన్నారు. హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, అంజయ్య, డీటీఎఫ్ గూడూరు మండల అధ్యక్షుడు గుంటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు జుమ్మాలాల్, రాజ్‌కుమార్, రాంబాబు, రాజేందర్, నిర్మల, నర్సింహరావు, బేబి, వసంత పాల్గొన్నారు.


ముల్కలపల్లి జడ్పీ హైస్కూల్లో జీవో 25ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్న ఉపాధ్యాయులు

చిన్నముప్పారం జీపీ భవనాన్ని పరిశీలించిన అధికారులు

నెల్లికుదురు, సెప్టెంబరు 25 : ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం గ్రామపంచాయతీ భవనాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పీఆర్ డీఈ రాంబాబు మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవనం పనులు పూర్తికాక పోవడంతో పనులు పూర్తి చేయడానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో పనులు పూరి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మానస, పంచాయతీ కార్యదర్శి ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఆటో డ్రైవర్ల చేయూత

కేసముద్రం, సెప్టెంబరు 25 : మండలంలోని కల్వల మోడల్ స్కూల్లో విద్యార్థుల టాయ్‌లెట్లను మరమ్మతులు చేయించేందుకు వారి తల్లిదండ్రులైన ఆటోడ్రైవర్లు ప్రిన్సిపాల్ నవీన్‌కు రూ.5 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అల్పాదాయం కలిగిన ఆటో డ్రైవర్లు అయినప్పటికీ పాఠశాల అభివృద్ధి కోసం సహాయం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండబోయిన అశోక్, ఎండీ.గుంషావలి, బేతు అశోక్, కత్రి సుభాస్, వేణువంక వెంకటేశ్వర్లు, పింగిలి కిషోర్, బండారి నాగరాజు, బాలు, నరేష్ నరేష్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ ఇచ్చినా బిల్లు ఇస్తలేరు

● టెక్నికల్ అసిస్టెంట్‌పై కాంట్రాక్టర్ ఆరోపణ ● మంజూరు చేయాలని అధికారులకు విన్నపం


కోనాపురంలో రోడ్డు, (ఇన్‌సెట్లో) కాంట్రాక్టర్ ఐలయ్య

కొత్తగూడ, సెప్టెంబరు 25 : పల్లెల అభివృద్ధితో పాటు పేదలకు పనిదినాల కల్పనకు ఉద్దేశించి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కొందరు అధికారుల కక్కుర్తి వల్ల పక్కదారి పడుతోంది. గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో మంజూరైన పనులను వేగవంతం చేయాలని, చేసిన వాటికి సకాలంలో బిల్లులు చెల్లించాలని ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నా.. అధికారులు మాత్రం కమీషన్‌ల కోసం కాంట్రాక్టర్‌లను వేధిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక కాంట్రాక్టర్‌లు ఉన్నతాధికారులను సంప్రదిస్తూ తమ వేదనను విన్నవించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..

కోనాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో రెండురోడ్లు మంజూరయ్యాయి. ఈ రోడ్లకు 100 మంది ఉపాధి కూలీలు 6వారాలు పనిచేశారు. ఇందుకు గాను కూలీల నుంచి రూ.200 చొప్పున ఆరు వారాలకు రూ.లక్షా 20 వేలను టీఏ రాధికకు కమిషన్ ఇచ్చినట్టు కాంట్రాక్టర్ బొల్లం ఐలయ్య ఆరోపించారు. రోడ్డు పనులు పూర్తి చేసి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికి బిల్లులు చేయకుండా వేధిస్తోందని తెలిపారు. ఈసీ కోటిని ఐలయ్య సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై ఫోన్‌లో వివరణ ఈసీని 'ఆంధ్రజ్యోతి' బుధవారం వివరణ కోరగా టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) రాధిక పని వివరాలు ఇవ్వటం లేదని, ఇస్తే కొలతలు తీసి రికార్డు చేస్తానని కోటి తెలిపారు.

పని విరాలతో వస్తే బిల్లులు ఇస్తాం

డీఆర్‌డీఏ పీడీ మధుసుదన్‌రావు

బిల్లుల కోసం ఈజీఎస్ టీఏ, ఈసీ, ఏపీవో చుట్టూ తిరిగి, విసిగిపోయిన కాంట్రాక్టర్ ఐలయ్య డీఆర్‌డీఏ పీడీ మధుసుదన్‌రావుకు ఫోన్‌లో తన బాధను వివరించారు. పనివివరాలలో కార్యాలయానికి వస్తే సమస్యను పరిష్కరించి, బిల్లులు ఇస్తామని పీడీ తెలిపారు

రైల్వే అండర్ పాస్‌లు నిర్మించాలి

● మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 25 : మహబూబాబాద్ నుంచి కేసముద్రం వెళ్లె రైల్వేలైన్ మధ్యలో ఉన్న అన్నారం, సర్వాపురం గ్రామాల వద్ద రైల్వే అండర్ పాస్‌లు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం భారతిశ్‌కుమార్ జైన్‌ను బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ అన్నారం, సర్వాపురం గ్రామాల వద్ద రైల్వే అండర్ పాస్‌లు లేక పోవడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాక్‌లు దాటాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో ట్రాక్ దాటుతుండగా గొర్రెలు రైలు ప్రమాదంలో మృతి చెందాయని గుర్తు చేశారు.

రైతులు బిక్కు, బిక్కు మంటూ రైలు ట్రాక్ దాటుతున్నారని రైల్వే అధికారులు చొరవ చూపి అండర్ పాస్‌లను నిర్మించి, సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన డీఆర్‌ఎం అండర్ పాస్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రమేష్‌చందర్‌రెడ్డి పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌ఎం భారతిశ్‌కుమార్‌జైన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్యమురళీనాయక్

'ప్రశస్త్'తో వైకల్య గుర్తింపు

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు ఈనెల 26 నుంచి అక్టోబరు 26 వరకు మొదటి దశలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్ర్కీనింగ్ పరీక్షలు చేసి, వైకల్యాన్ని గుర్తించనున్నారు. రెండోదశలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు (ఐఈఆర్పీ)లు అక్టోబరు 26 నుంచి నవంబరు 14 వరకు ఉపాధ్యాయులు గుర్తించిన పిల్లలను రీసర్వే చేసి వైకల్యం ఉన్న వారిని ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. మూడోదశలో అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రతీ పిల్లవాడిని పరీక్షించి వైకల్యం ఉందని నిర్ధారిస్తే సదరం సర్టిఫికెట్‌తో పాటు ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలను అందిస్తారు. ఒకవేళ వైకల్యం తగ్గించే అవకాశం ఉందని గుర్తిస్తే తల్లిదండ్రుల సూచన మేరకు ముందుకు వెళతారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్నియాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1054 ఉండగా వాటిల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మీడియంలలో 98 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

యాప్ పని ఇలా..

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల్లో వైకల్యం గుర్తించేందుకు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. పిల్లల్లో మానసిక ఎదుగుదల వైకల్యం, ఆరోగ్యపరంగా ఫిట్‌నెస్ ఎలా ఉందనే దానిపై ప్రశస్త్ మొదలగు పరీక్షలు నిర్వహిస్తే.. చిన్నతనంలోనే రోగాన్ని గుర్తించి, పిల్లల ఎదుగుదలలో ఆరోగ్య సమస్యలు రాకుండాచేసే అవకాశం ఉంటుంది. ఇందులో 21 రకాల వైకల్యాలకు సంబంధించి 60ప్రశ్నలను రూపొందించారు. వీటి ద్వారా సదరు విద్యార్థులను ప్రశ్నిస్తూ వారిలో ఉన్నలోపాలను ఈ యాప్‌లో పొందుపరుస్తారు. దీంతో ప్రాథమిక దశలో ఉన్న వైకల్యాన్ని నయం చేసే అవకాశం ఉంటుంది. పుట్టుకతోనే వైకల్యంతో ఉన్న పిల్లలకు మాత్రంమూడు దశల్లో స్ర్కీనింగ్ చేసి, ప్రభుత్వ పరంగా రావాల్సిన సౌకర్యాలను అందించనున్నారు.

చిన్నారులకు వైద్య సదుపాయం కల్పించాలి

● డీఎంహెచ్‌వో గుండాల మురళీధర్

నెహ్రూసెంటరు, సెప్టెంబరు 25 : చిన్న పిల్లల్లో ఏర్పడే అనారోగ్య సమస్యలను నివారించేందుకు అవసరమైన వైద్య సేవలందించాలని మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) గుండాల మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆర్బీఎస్‌కే అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, డ్రైవర్స్ సమయపాలన పాటించాలన్నారు. జి.లక్ష్మీనారాయణ, కుమార్, కె.ప్రసాద్, కెవి.రాజు, మంగమ్మ, రామకృష్ణ, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలందించడంలో..

రూరల్ ఠాణాకు తొమ్మిదో స్థానం

● డీజీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న ఎస్సై దీపికరెడ్డి


డీజీపీచేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్సై దీపికరెడ్డి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 25 : ప్రజలకు సత్వర సేవలందించడంలో మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలో తొమ్మిదవ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ రాష్ట డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్‌రెడ్డి చేతుల మీదుగా మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం ప్రశంసా పత్రంతోపాటు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆన్‌లైన్ ఫీడ్ బ్యాక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలందించడంలో తెలంగాణలో పది పోలీస్‌స్టేషన్‌లను ఎంపిక చేయగా, అందులో మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు 9వ స్థానం దక్కిందన్నారు. పోలీస్‌స్టేషన్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో అధ్యాపక పోస్టుకు నేడు డెమో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 : జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అధ్యాపక పోస్టు భర్తీకి ఈనెల 26న డెమో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.సునిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగత నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు రాజనీతి శాస్త్రం బోధించేందుకు అనుభవం, అర్హత కలిగిన ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఇంగ్లీష్ మాధ్యమంలో బోధించే సామర్థ్యం కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు అర్హత సర్టిఫికెట్లతో మోడల్‌స్కూల్‌లో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతిపీరియడ్‌కు రూ.182చొప్పున నెలకు రూ.18,200 వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ నియామకం తాత్కాలికమేనని చెప్పారు. ఈ సదవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పాథమిక విద్య పునాది లాంటిది'

నెల్లికుదురు, సెప్టెంబరు 25 : విద్యార్థులకు పాథమికవిద్య పునాదిలాంటిదని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విదాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరివిల్లు మండలస్థాయి సమావేశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చతుర్విద ప్రకియలైన చదవడం, రాయడం, లెక్కలు చేయడంపై పట్టు సాధిస్తే ఉన్నత చదవులకు పునాదిగా మారుతుందన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీడీఏ సబ్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 25 : జిల్లాలో ఐటీడీఏ సబ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుగులోతు భీమానాయక్, తేజావత్ వాసునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ములుగులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోఆర్సీవో కార్యాలయం తరలింపు చేయకుండా ములుగు సబ్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లుగానే ఏటూరు నాగారం ఐటీడీఏను మహబూబాబాద్ జిల్లాలో ఉప కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. గూడూరు, కొత్తగూడ మండలాల్లో ఐటీడీఏ ఉప కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన ప్రదేశమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఐటీడీఏ ఉప కార్యాలయం మంజూరు చేయాలన్నారు. బోడ రమేష్ నాయక్, శివవర్మ, రాందాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 25 : మహబూబాబాద్ పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో బుధవారం మునిసిపల్ పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, వార్డు కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, పోతురాజు రాజు, తాళ్లపల్లి జగన్, బోనగిరి గంగాధర్, డౌలాగర్ శంకర్, షేక్. ఖలీల్, కర్పూరపు గోపి, వైద్యులు కిరణ్మయి, రమ్య, నితిన్, సిబ్బంది పుష్పలీల, పొబిలిశెట్టి రామకృష్ణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, రాజేష్, లత, క్రాంతి పాల్గొన్నారు.


'నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు'

బయ్యారం, సెప్టెంబరు 25 : నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏడీఏ శ్రీనివాస్ రావు పురుగుమందు షాపుల యజమానులను హెచ్చరించారు. బయ్యారంలో బుధవారం బయ్యారం, గార్ల మండలాల పరిధి ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ విక్రమదారుల సమావేశం జరిగింది. సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ నిబంధనల మేరకు పురుగుమందులను విక్రయించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయశాఖ అధికారి రాంజీనాయక్, ఏఈవోలు, పెర్టిలైజర్స్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా ప్రభుదాస్

డోర్నకల్, సెప్టెంబరు 25 : డోర్నకల్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా ప్రభుదాస్ ఎన్నికయ్యారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అధ్యక్షతన ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శి ఆర్.రమేష్, అసోసియేట్ అధ్యక్షులుగా వి.శ్రీనివాస్, సంజీవరావు, మహిళ ఉపాధ్యక్షులు శేషదీపిక, ఉపాధ్యక్షులుగా సురేష్, జె.శ్రీనివాస్, మహిళ కార్యదర్శి ఉష, శ్రీలత, కార్యదర్శులుగా ప్రదీప్, రామరాజులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చాగర్లముడి శ్రీధర్, వెంపటి సీతారాములు, రుక్మాంగధరావు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన మాజీ ఎంపీ


మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 25 : ఉమ్మడి వరంగల్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ రామసహాయం సురేం దర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. అభినం దనలు తెలియ చేశారు. నాయకుడు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారికి ఘన సన్మానం

గార్ల, సెప్టెంబరు 25 : నూతనంగా మండల విద్యాశాఖాధికారిగా ఉదవి బాధ్యతలు చేపట్టిన మంకిడి వీరభద్రంను ఆదివాసి టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం ఎంఆర్‌సీ భవనంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు మోకాళ్ల రామచంద్రు, సిద్ధబోయిన భిక్షం, కల్తీ భాస్కర్, సిద్ధబోయిన జోగయ్య, కబ్బాకుల వెంకన్న చుంచు రవీందర్, పూనెం రవికుమార్, బబ్బా వీరస్వామి, ఊకే సారంగపాణి పాల్గొన్నారు.

'రుణమాఫీ నగదును వెంటనే ఇవ్వాలి'

కురవి, సెప్టెంబరు 25 : ప్రభుత్వం మంజూరు చేసిన రుణమాఫీ నగదును రైతాంగానికి బ్యాంకర్లు తక్షణమే అందించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బలపాలలో బ్యాంకు మేనేజర్ సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. గిరిజన సంఘం నాయకులు రామకృష్ణనాయక్, మాలోతు హరిలాల్‌నాయక్, మాలోతు స్వామినాయక్, మాలోతు ఈర, మాలోతు వెంకన్న, మాలోతు రమేష్, మాలోతు ధర్మానాయక్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో విఫలం : బీజేపీ

దంతాలపల్లి, సెప్టెంబరు 25 : రైతాంగానికి ఎన్నికల హామీలో ఇచ్చిన రుణమాఫీని అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగ విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి పలు వినతులతో కూడిన పత్రంను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఇవ్వలేదన్నారు. ఇటీవల రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులందరికి రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ తాడ పూర్ణచందర్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి దాసరి మురళి, నాయకులు ప్రవీణ్, ఉమేష్, వెంకన్న పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులు వెంటనే స్పందించాలి

దంతాలపల్లి, సెప్టెంబరు 25 : మండలంలోని 17 గ్రామ పంచాయతీలో పని చేసే పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు వెంటనే స్పందించేందు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వివేక్రమ్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ఎంపీవో అప్సరపాషతో కలిసి బీరిశెట్టిగూడెం, బొడ్లాడ, మండల కేంద్రంలో సందర్శించి పలు సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కనీస సౌకర్యాలను గుర్తించాలన్నారు. ఎంపీవో అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటికి కాంగ్రెస్ నాయకుడి సహకారం

చిన్నగూడూరు, సెప్టెంబరు, 25 : చిన్నగూడూరు గ్రామ పంచాయతీ తాగునీటి మోటారు మట్టిలో కురుకుపోయింది. దీంతో గ్రామప్రజలు తాగునీటి కోసం పది రోజులుగా ఇబ్బందులు పడుతుంటే స్పందించిన డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ బుధవారం సొంత ఖర్చులతో 7హెచ్‌పీ విద్యుత్ మోటారు, సంబంధిత విద్యుత్ సామగ్రి అందించి, గ్రామానికి తాగునీరు సరఫరాకు సహకరించాడు. దీంతో చిన్నగూడూరు గ్రామ ప్రజలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి సోమన్న, దొంగరి నర్సయ్య, మాజీవైస్ ఎంపీపీ వీరన్న, రమేష్, మోసిన్ ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈవోకు సన్మానం

పెద్దవంగర, సెప్టెంబర్ 25 : మండల ఇన్‌చార్జి ఎంఈవోగా నియమితులైన హెచ్‌ఎం బుధవారపు శ్రీనివాస్‌ను బుధవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం జీవోనెం 25ను వెంటనే రద్దుచేసి ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసంబద్ధ రేషనలైజేషన్ జీవోనెం 25ను సవరించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ నాయకులు సురేష్, నరేందర్ రెడ్డి, అంజయ్య, వేణుమాదవ్ పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 : రేషనలైజేషన్, వర్క్ అడ్జస్టమెంట్ పేరుతో ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 25న వెంటనే ఉపసంహరించాలని ఉద్యోగుల జాయింట్‌యాక్షన్ కమిటీ నాయకులు భూక్య రామోజీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోట్యానాయక్, గోవర్ధన్, నాగరాజు, బాలునాయక్, జోస్నారెడ్డి, అనిత రెడ్డి, భవాని, నవత, మమత, విజయ్, విద్యాసాగర్, సత్యనారాయణరెడ్డి, ఇద్దయ్య, జోస్పిన్, శోభారాణి, వాణి, కల్పన పాల్గొన్నారు.

'ఇళ్ల కూల్చివేత నోటీసులను ఉపసంహరించుకోవాలి'

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 25 : నిరుపేదల ఇళ్లను కూల్చవద్దని వారికిచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పేదల ఇళ్లను కూల్చవద్దంటూ స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎకదుట బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో కడు నిరుపేదలు గుండ్లకుంట కాలనీ, ఆకుల లక్ష్మయ్యనగర్ కాలనీ, గోపాలపురంల్లో 35 సంవత్సరాల నుంచి చిన్న చిన్న ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను ముట్టుకోబోమని చెప్పినప్పటికి అధికారులు మాత్రం చెరువు శిఖమని, ఎఫ్‌టీఎల్ అని మునిసిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. సమ్మెట రాజమౌళి, కుంట ఉపేందర్, చీపిరి యాకయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, భాగ్యమ్మ, వవెంకన్న, భిక్షపతి పాల్గొన్నారు.